06-06-2025
శుక్రవారం
మల్కాజిగిరి
jayabherinews
JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 249 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

## వర్షకాలంలో కరోనా తుఫాన్.!

- దేశంలో పెరుగుతున్న కరోనా కేసులు.. ఏడుగురు మృతి
- మళ్లీ అలర్ట్ అవ్వాల్సిన సమయం వచ్చేసింది. అందరూ లైట్ తీసుకుంటున్నారు కానీ.. దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 5 వేలకు చేరుతుంది. ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 4వేల 866. సైంటిస్టులు సైతం ఊహించని దూకుడు అది. భయపెట్టడానికి చెబుతుంది కాదిది. ప్రస్తుతం డేటా ఇస్తున్న వార్నింగ్.



**జయభేరి, న్యూ ఢిల్లీ జూన్ 5 :**

కరోనాను చాలా మంది లైట్ తీసుకుంటున్నారు. కరోనా వస్తే ఏమౌతుందిలే.. ఇప్పటికే రెండు సార్లు చూశాం అంటున్నారు. కానీ పరిస్థితి అలా లేదు. దేశంలో కరోనా వైరస్ కేసులు మళ్లీ ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. గత కొద్ది రోజులుగా తగ్గుముఖం పట్టినట్లు కనిపించిన మహమ్మారి, ఇప్పుడు మళ్లీ విజృంభిస్తుండటంతో ...మిగతాది 2 లో

## 15 లక్షల కుటుంబాలకు అండ

- ఆగస్ట్ 15 కల్లా 15 లక్షల 'బంగారు కుటుంబాలు' దత్తత
- పీ4కి కేస్ స్టడీగా అమరావతి
- పీ4కు భాగస్వాముల సహకారం... - సీఎం చంద్రబాబు



**జయభేరి, విజయవాడ, జూన్ 5 :**

పీ 4 మిషన్ పై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఆగస్ట్ 15 కల్లా 15 లక్షల 'బంగారు కుటుంబాలు'ను దత్తత తీసుకునేలా చూడాలని ఆదేశించారు. మరింత వేగవంతంగా 'మార్గదర్శి' నమోదు ప్రక్రియను చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.

**ఆగస్ట్ 15 కల్లా 15 లక్షల 'బంగారు కుటుంబాలు' దత్తత - సీఎం చంద్రబాబు**

జీరో పావర్టీ పీ4 లక్ష్యంలో భాగంగా ఈ ఏడాది ఆగస్ట్ 15 నాటికి రాష్ట్రంలో 15 లక్షల కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన మార్గదర్శి రిజిస్ట్రేషన్, దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. ...మిగతాది 2 లో

## పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు



**జయభేరి, న్యూఢిల్లీ, జూన్ 5:**

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం.. పార్లమెంటు వర్షాకాల సమావేశాల షెడ్యూల్ విడుదల చేసింది. జులై 21వ తేదీ నుంచి ఆగస్ట్ 12వ తేదీ వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఒకవైపు.. ఆపరేషన్ సిందూర్ గురించి చర్చకు పట్టుబడుతున్న ప్రతిపక్షాలు.. పార్లమెంటును ప్రత్యేకంగా సమావేశపరచాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కేంద్రం నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. అయితే నిబంధనల ప్రకారం పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే అన్ని అంశాలపై చర్చించవచ్చని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు.పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు సంబంధించి.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ తేదీలను సిఫార్సు చేసినట్లు కిరణ్ రిజిజు వెల్లడించారు. ఈ క్రమంలోనే పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్.. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ...మిగతాది 2 లో



## కర్ణాటక ప్రభుత్వానికి
# హైకోర్టు వార్నింగ్

చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాట ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలని సీఎం సిద్ధరామయ్య డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు. కాగా ఈ ఘటనకు సంబంధించి పలువురు పోలీస్ ఉన్నతాధికారులపై వేటు పడింది. కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, స్టేషన్ హౌస్ మాస్టర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఏసీపీ, సెంట్రల్ డివిజన్ డీసీపీ, క్రికెట్ స్టేడియం ఇన్‌ఛార్జి, అదనపు పోలీస్ కమిషనర్, నగర పోలీస్ కమిషనర్ సస్పెండ్ అయ్యారు.

- తొక్కిసలాటను సుమోటగా తీసుకున్న కోర్టు
- బెంగళూరు నగర పోలీస్ కమిషనర్‌పై వేటు.. RCBపై కేసు..

**జయభేరి, బెంగళూరు, జూన్ 5 :**

ఆర్సీబీ ఐపీఎల్ ట్రోఫీ విజయాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమం విషాదంతో ముగిసింది. చిన్నస్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటపై హైకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. ప్రభుత్వంపై సీరియస్ అయ్యింది. కనీస వసతులు లేకుండా ఈవెంట్ ఎవరు ఎలా నిర్వహించారని ప్రశ్నించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ విజయోత్సవ వేడుకల సందర్భంగా బెంగళూరులోని ఎం చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాటపై కర్ణాటక హైకోర్టు బుధవారం అధికారిక విచారణ ప్రారంభించింది. ఈవెంట్ల క్రమం, భద్రతా సన్నద్ధత, జనసమూహ నిర్వహణ ప్రణాళికలు, ఈవెంట్ నిర్వాహకులు, అధికారుల మధ్య సమన్వయాన్ని వివరిస్తూ వివరణాత్మక నివేదికను దాఖలు చేయాలని ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రాథమిక దర్యాప్తు తర్వాత వివరాలు వెల్లడించాలని పేర్కొంది. అందుకు ఐదు రోజుల సమయం ఇస్తూ కోర్టు తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాట కేసులో రాయల్ ఛాలెంజర్ బెంగళూరు యాజమాన్యం ఇరుక్కుంది. తొక్కిసలాట జరగడానికి కొన్ని గంటల ముందు RCB యాజమాన్యం సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పోస్ట్ పెట్టింది. దీనిపై ఇప్పుడు దర్యాప్తు జరుగుతుంది.మరోవైపు దర్యాప్తులో భాగంగా కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (KSCA) సీనియర్ సభ్యుల్ని కూడా ప్రశ్నించనున్నారు. సన్మాన వేడుకను ప్లాన్ చేయడంలో వారి పాత్రను ...మిగతాది 2 లో

## గులాబీలో దెయ్యాలు మాయమైనట్టేనా

**జయభేరి, హైదరాబాద్, జూన్ 5:**

BRS పార్టీలో ఏం జరుగుతోంది. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంలో ఏం జరగబోతోంది. కవిత విషయంలో నెక్స్ట్ ఏంటి.. షోకాజ్ నోటీసులు ఇస్తారా.. ఇవ్వరా.., కవితపై చర్యలు తీసుకుంటారా లేదా.. ఇంతకీ కవిత కొత్త పార్టీ పెడుతుందా.. ఇలా ఎన్నో ప్రశ్నలు .. ఇన్నాళ్లు లక్షలాది మెదళ్లను కదిలిస్తూనే ఉన్నాయి. కానీ తాజాగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే..ఈ ప్రశ్నలకు సమాధానం మాత్రం దొరకదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మే 2 వతేదిన బీఆర్ ఎస్ పార్టీ అధినేత, తన తండ్రి కేసీఆర్ కు ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత లేఖరాశారు. మైడియర్ డాడీ అంటూ మొదలుపెట్టి, మీరు అలా మాట్లాడటం బాగుంది, కానీ ఇలా కూడా మాట్లాడవలసింది. బిజెపితో దోస్తీ అనే అనుమానం రాకుండా విమర్శల డోస్ పెంచాల్సింది. అంటూ బిఆర్ఎస్ వరంగల్ రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రసంగంపై , పార్టీలో అనుమానాలు , కార్యకర్తలకు జరుగుతున్న ...మిగతాది 2 లో




## అమెరికా దివాళ తీస్తోందా..?

2 లో

## రేషన్.. పరేషాన్...



**జయభేరి, కరీంనగర్, జూన్ 5:**

సన్నబియ్యానికి తెలంగాణలో డిమాండ్ పెరిగింది. తెలంగాణలో రేషన్ షాపుల ముందు ప్రజలు బియ్యం తీసుకోవడానికి పడిగాపులు కాస్తున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడలేక సంచులు, చెప్పులు పెడుతున్నారు. ఒక వ్యక్తికి రేషన్ ఇచ్చేందుకు దాదాపు 30 నిమిషాల సమయం పడుతుందని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల రేషన్ ఒకేసారి

2 లో

## కాళేశ్వరం ప్రాజెక్టులో ఏం జరగబోతోంది



**జయభేరి, హైదరాబాద్, జూన్ 5:**

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఒక అద్భుతమైన ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనమని చాలామంది భావిస్తారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అవినీతి, నాణ్యతా లోపాలకు నిలయంగా ఆరోపిస్తోంది. ఈ ప్రాజెక్టు తెలంగాణకు జీవనాడి అని గులాబీ నేతలు అంటుంటే, ఇది మొత్తం అవినీతిమయం అని హస్తం నేతలు విమర్శిస్తున్నారు.

2 లో

## చెట్లు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది?

- సీఎం చంద్రబాబు



**జయభేరి, గుంటూరు:**

చెట్లు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిదని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం అనంతవరం ఏడీసీఎల్ పార్కులో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టు వార్నింగ్

ఇప్పుడు బెంగళూరు పోలీసులు మెజిస్టీరియల్ దర్యాప్తు ప్యానెల్ సమీక్షిస్తోంది. జూన్ 4న మధ్యాహ్నం 3:14 గంటలకు, RCB అధికారిక ఖాతా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ X (గతంలో ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. సాయంత్రం 5 గంటలకు విధానసౌధ నుంచి చిన్నస్వామి స్టేడియం వరకు విక్టరీ పరేడ్ ప్రారంభమవుతుందని ధృవీకరిస్తుంది అందులో పేర్కొన్నారు. స్టేడియం లోపల సన్మాన కార్యక్రమం జరుగుతుందని కూడా చెప్పారు. ఉచిత పాస్‌ల కోసం లింక్ కూడా ఇచ్చారు. అభిమానులు పోలీసు మార్గదర్శకాలను పాటించాలని అభ్యర్థించారు.ఆ పోస్ట్‌లో, "విజయోత్సవ కవాతు తర్వాత చిన్నస్వామి స్టేడియంలో వేడుకలు జరుగుతాయి. అభిమానులు అందరూ రోడ్ షోను ప్రశాంతంగా ఆస్వాదించగలిగేలా పోలీసులు, ఇతర అధికారులు నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించాలని అభ్యర్థిస్తున్నాము. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్టు విజయోత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటనలో 11 మంది అభిమానులు మరణించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో, మృతుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఆర్సీబీ యాజమాన్యం ముందుకు వచ్చింది. మరణించిన ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని ఆర్సీబీ తమ అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించింది. వారి చికిత్స ఖర్చుల నిమిత్తం 'ఆర్సీబీ కేర్స్' పేరిట ప్రత్యేకంగా నిధులు సేకరించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఇదిలా ఉండగా, కర్ణాటక ప్రభుత్వం కూడా ఈ దుర్ఘటనపై తక్షణమే స్పందించి, మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించిన విషయం తెలిసిందే."మాకు ప్రతి ఒక్కరి క్షేమం అత్యంత ముఖ్యం. ఈ దుర్ఘటన గురించి తెలిసిన వెంటనే మా కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకున్నాం. బాధిత కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. స్థానిక అధికారులకు మా పూర్తి సహకారం అందిస్తాం. ఈ కష్ట సమయంలో మాకు మద్దతుగా నిలిచే వారికి ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాం, దయచేసి అందరూ సురక్షితంగా ఉండండి" అని ఆర్సీబీ యాజమాన్యం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో అభ్యర్థించింది.

## దెయ్యాలు మాయమైనట్టేనా..

అన్యాయంపై లేఖలో వివరిస్తూ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు..మే 22వ తేది.. సరిగ్గా లేఖ రాసిన ఇరవైరోజుల తరువాత కవిత రాసిన లేఖ లీకైయ్యింది. మీడియా చేతికి కవిత తండ్రికి రాసిన సీక్రెట్ లేఖ చిక్కింది. ఇంకేముంది వరుస కథనాలతో మీడియా హోరెత్తించింది. పార్టీలో ఇన్నాళ్లు గుట్టుచప్పుడుకాకుండా ఉన్న లోపాలు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాయి. మే 23వ తేది.. అమెరికా పర్యటన తిరుగు ప్రయాణంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న కవిత మీడియాతో మాట్లడారు. తాను రాసిన లేఖ లీక్ పై ప్రశ్నించిన మీడియా సైతం అవక్కాయ్యేలా సొంత పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. తన తండ్రి కేసీఆర్ దేవుడు అంటూ మొదలుపెట్టి, ఆయన చుట్టూ కొన్ని దెయ్యాలున్నాయి, పార్టీ నుండి కోవర్టులను బయటకు పంపాలి. తాను తన తండ్రికి రాసిన లేఖను లీక్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.మే 29వ తేది.. నేను జైలులో ఉన్నప్పుడు బిజెపిలో బిఆర్ ఎస్ విలీనం చేసేందుకు సిద్ధమైయ్యారు. మరో నేతకు నోటీసులు ఇస్తే నానా హంగామా చేస్తారా అంటూ నేరుగా అన్న కేటీఆర్, బావ హరీష్‌రావులను టార్గెట్ చేశారు.ఇదే చివరిగా బీఆర్ ఎస్ పార్టీపై కవిత చేసిన విమర్శలు. నేరుగా మీడియా కెమెరాల ముందు ఓసారి, చిట్ చాట్ పేరుతో మరోసారి సొంత పార్టీలో పరిణామాలపై విరుచుకుపడిన కవిత, ఆ దెయ్యాల వల్లే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని ధిక్కార స్వరంతో మాట్లాడిన కవిత. దెయ్యాల విషయం తేల్చాలంటూ ప్రశ్నించలేదు. ఇదిలా ఉంటే గతంలో ఎన్నడూ లేనట్లుగా మే 31వ తేది తెలంగాణ జాగృతి నూతన కార్యాలయం ప్రారంభించారు. వడ్డించేవాడు మనవాడైతే.. బంతిలో చివరిన కూర్చున్నా అన్నీ అందుతాయనే సామెతే ఉండేనే ఉంది. అచ్చం ఆ సామెతను తలదన్నేలా ., కవిత ఎపిసోడ్ ముగిసిందనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. బిఆర్ ఎస్ పార్టీలో తన తండ్రి చుట్టూ దెయ్యాలున్నాయి అంటూ మొదలైన కవిత ఆగ్రహం, తెలంగాణ జాగృతి నూతన కార్యాలయం ఏర్పాటుతో వేరు కుంపటి పెట్టడం, కేసీఆర్ కు జాగృతి రెండో కన్ను అనడం, జాగృతీ జిల్లా నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో బీఆర్ ఎస్ కు దూరమైయ్యారు.తాజాగా మరో అడుగు ముందుకేసి బీఆర్ ఎస్ బాస్ నోటీసులకు నిరసనగా, బీఆర్ ఎస్ చేయాల్సిన నిరసనలు తాను బుజానకెత్తుకుని, జాగృతి ఆధ్వర్యంలో మహాధర్నాకు పిలుపునివ్వడం చూస్తుంటే, బీఆర్ ఎస్ లో కేసీఆర్ చుట్టూ ఉన్న దెయ్యాలను జాగృతీ మంత్రంతో వదిలించినట్లయ్యిందనే విమర్శలొస్తున్నాయి. సొంత కుంపటి కోసం ఇంత రాద్ధాంతం అవసరమా అనే వాదనలు వినిపిస్తున్నాయి.

## పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు

ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని.. ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ ఆపరేషన్ సిందూర్ గురించి పూర్తి సమాచారం ప్రజలకు వెల్లడించాలని.. ఆపరేషన్ సిందూర్ గురించి పార్లమెంటులో చర్చించాలని పట్టుబడుతున్న ప్రతిపక్ష పార్టీలు.. ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేసిన విషయం కూడా తెలిసిందే.ఈ నేపథ్యంలోనే ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై స్పందించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు.. తాము నిబంధనల ప్రకారం వర్షాకాల సమావేశాల్లోనే అన్ని అంశాలపై చర్చించవచ్చని వెల్లడించారు. దీంతో ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్ అయిన ఆపరేషన్ సిందూర్‌ను పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే చర్చించే అవకాశం ఉందని స్పష్టంగా తెలుస్తోంది. అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం అందుకు ససేమిరా అంటోంది. ఈ నేపథ్యంలోనే పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు సంబంధించిన షెడ్యూల్ రావడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లోనే నరేంద్ర మోదీ సర్కార్‌ను నిలదీయాలని విపక్షాలు భావిస్తున్నాయి. మరోవైపు..గత కొన్ని రోజులుగా ఆపరేషన్ సిందూర్ విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని.. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే.

## 15 లక్షల కుటుంబాలకు అండ

నాడు ఆర్థిక సంస్కరణల తర్వాత చేపట్టిన పీపీపీ విధానానికి కొనసాగింపుగానే నేడు పీ4 విధానం తీసుకువచ్చామని అన్నారు. బుధవారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో జీరో పావర్టీ పీ4పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... స్మార్ట్ ఏపీ ఫౌండేషన్‌ను స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్‌గా మార్చాలని నిర్దేశించారు. అమరావతి పీ4కి కేస్ స్టడీగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు.రాజధాని నిర్మాణంలో 29 వేల మంది రైతులను భాగస్వాములు చేయడం ద్వారా వారికి సంపద సృష్టి జరిగేలా చేశామని చెప్పారు. ఇదే స్ఫూర్తితో ప్రతి బంగారు కుటుంబాన్ని మార్గదర్శి దత్తత తీసుకుని వారి ఉన్నతికి కృషి చేసేలా చూడాలన్నారు. ప్రతి 10 రోజులకు ఒకసారి పీ4 పురోగతిని సమీక్షిస్తానని ముఖ్యమంత్రి అన్నారు. మరోవైపు అధికారులు రూపొందించిన పీ4 లోగో డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలించారు.

పీ4 కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించేందుకు మిలాప్, ప్రాజెక్ట్ డీప్, రంగ్ దే, భార్గో వంటి సంస్థలు భాగస్వాములుగా సహకారం అందించేందుకు ముందుకువచ్చినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలో 19,15,771 బంగారు కుటుంబాలుగా నమోదు కాగా... వీరిలో ఇప్పటివరకు 70,272 కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారని వివరించారు. వీరిలో అత్యధికంగా 26,340 బీసీ కుటుంబాలు, 14,024 ఎస్సీ కుటుంబాలు, 13,115 ఎస్టీ కుటుంబాలు ఉన్నాయని తెలిపారు.

## వర్షకాలంలో కరోనా తుఫాన్.!

ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది, మరణాలు కూడా నమోదవుతున్నాయి. అత్యధికంగా కేరళలో కరోనా సంక్రమణ కన్పిస్తోంది. ప్రస్తుతం కేరళలో పాజిటివ్ కేసులు 1500 దగ్గరలో ఉన్నాయి. మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ ఇలా ఒక్కో రాష్ట్రంలో 500పైగా కేసులు నమోదయ్యాయి. ఇదేమీ లైట్ తీసుకోవాల్సిన విషయంగా కనిపించటం లేదని.. ప్రభుత్వ లెక్కలతోనే తెలుస్తోంది. పరీక్షలు చేయించుకోని వారు ఇంకెంత మంది ఉన్నారో.. జలుబు, దగ్గు, జ్వరంగా మామూలే కదా అంటూ ట్యాబ్లెట్లు వాడుతున్న వారు ఇంకెంత మంది ఉన్నారో అనే భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబుతో ఎవరు వచ్చినా టెస్టులు తప్పనిసరి చేస్తున్నారు. కొవిడ్ టెస్టులకు అవసరమయ్యే వైరల్ ట్రాన్స్‌మిషన్ మీడియా కిట్లు, RNA ఎక్స్‌ట్రాక్షన్ కిట్లు, RTPCR కిట్లు అందుబాటులో ఉంచుతున్నారు. కొవిడ్ పాజిటివ్ అని తేలితే ఐసోలేషన్ వార్డ్స్‌లో పెడుతున్నారు. ఇక తెలంగాణలో కొవిడ్ కంట్రోల్‌లోనే ఉంది. ఇప్పటికే ఆక్సీజన్ సిలిండర్లు, బెడ్లు, కావాల్సిన అన్ని సదుపాయాలతో రెడీగా ఉన్నామన్నారు. అన్ని జిల్లాలకు గైడ్‌లైన్స్ కూడా పంపించారు. ఫస్ట్‌వేవ్, సెకండ్ వేవ్‌లో కొవిడ్ కేసులు ఒకట్రెండు రోజుల్లోనే రెట్టింపు అయ్యాయి. ఇప్పుడు కూడా అలాగే జరిగితే మాత్రం.. మరింత అప్రమత్తత అవసరమని చెబుతున్నారు. బీ కేర్ ఫుల్.

# అమెరికా దివాళ తీస్తోందా..?

**ప్రపంచ దేశాలకు పెద్దన్న.. అగ్రరాజ్యం..సంపన్న దేశం అమెరికా త్వరలోనే దివాలా తీస్తుందట. అవును ఈ మాటలు అన్నది మరెవరో కాదు.. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలోని డిపార్ట్ మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్) బాధ్యతలను నిర్వర్తించి ఇటీవలే ఆ బాధ్యతల నుంచి తప్పుకున్న ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్.**




**ఎలాన్ మస్క్, ప్రపంచ ప్రఖ్యాత వ్యాపారవేత్త, ఆవిష్కర్త, అమెరికా అధ్యక్ష సలహాదారుగా తన పదవి నుంచి వైదొలగడం ఒక ముఖ్యమైన రాజకీయ సంఘటనగా నిలిచింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ' (డోజ్) శాఖ సారథిగా మస్క్ అందించిన సేవలు, అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో సామర్థ్యాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించాయి.**

అమెరికా దివాలా వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. ట్రంప్ సర్కార్ తెచ్చిన ట్యాక్స్ బిల్లును వ్యతిరేకిస్తున్న మస్క్ ఇప్పటికే డోజ్ సారధ్య బాధ్యతల నుంచి వైదొలిగారు. కాంగ్రెస్ అమోదం కోసం వచ్చిన ట్యాక్స్ బిల్లుపై మస్క్ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. నన్ను క్షమించండి.. నేను ఇంతకంటే భరించలేను..'బిగ్ బ్యూటిఫుల్ బిల్' అత్యంత దారుణమైంది..కాంగ్రెస్ వ్యయ బిల్లు బిల్లు చాల చెడ్డది. దీంతో అమెరికన్లపై అధిక భారం పడుతుందని తెలిపారు. అది తప్పుడు బిల్లు అని మీకు తెలుసు. దీనికి ఓటు వేసిన వారు సిగ్గు పడాలి. అయినా ఈ బిల్లుకు మద్దతుగా ఓటేశారంటే అది మీకే అవమానం అని పేర్కొన్నారు. ఈ బిల్లు కారణంగా ద్రవ్యలోటు 2.5ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని..ఇది ఇలాగే కొనసాగితే అమెరికా దివాలా తీయడం ఖాయమని మస్క్ హెచ్చరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్ మధ్య చెడిందనే వార్తలు గుప్పమంటున్నాయి. ఈ క్రమంలో ఓ బిల్లు విషయమై ట్రంప్‌పై మస్క్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ట్రంప్ ప్రతిపాదించిన ఖర్చు బిల్లును 'అసహ్యకరమైన ఘోరమైన చర్య'గా అభివర్ణిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల వైట్ హౌస్ నుంచి మస్క్ నిష్క్రమించిన తరువాత, ఈ ఇద్దరి మధ్య ఉన్న విభేదాలు తాజాగా బయటపడ్డాయి. మస్క్ గత వారం డోజ్ చీఫ్ పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వ వృథా ఖర్చులను నివారించి, పాలనలో పారదర్శకత కోసం డోజ్‌ను ట్రంప్ ఏర్పాటుచేశారు. ధీనికి నాయకత్వం వహించిన మస్క్.. ఖర్చులను నివారించడాన్ని ట్రంప్ ప్రశంసించారు. కానీ అప్పటికే ఇద్దరి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి.'ఈ భారీ, దారుణమైన, అర్థరహిత ఖర్చులతో నిండిన కాంగ్రెస్ బిల్లు ఒక అసహ్యకరమైన ఘోరమైన చర్య. ఇది మానవాళిపై భారంగా మారుతుంది.. దీనికి ఓటేసిన వారందరికీ సిగ్గుపడాలి. మీరు తప్పు చేశారన్న విషయం మీకే తెలుసు' అ ని మస్క్ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేశారు. 'ట్రంప్ బిగ్, బ్యూటిఫుల్ బిల్'పై మస్క్ ఈ వ్యాఖ్యలు చేయడం తొలిసారి కాదు. ఈ బిల్లు వచ్చే 10 ఏళ్లలో అమెరికా రుణాలను 3 ట్రిలియన్ డాలర్లకు పెంచుతుందని అంచనా. ఇది ఆరోగ్య, ఆహార సహాయం వంటి ముఖ్యమైన కార్యక్రమాలకు భారీగా కోతలు పెట్టే ప్రయత్నంగా భావిస్తున్నప్పటికీ.. వాస్తవానికి ఖర్చు పెరుగుతాయి.డోజ్ శాఖ అధ్యక్షుడు ట్రంప్ రెండో పదవీ కాలంలో ఏర్పాటైంది. దీని ప్రధాన లక్ష్యం ప్రభుత్వ వ్యయంలో వృథాను తగ్గించి, సామర్థ్యాన్ని పెంచడం. ఎలాన్ మస్క్, టెస్లా, స్పేస్‌ఎక్స్ సీఈవోగా తన అనుభవాన్ని ఉపయోగించి, ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులను సూచించారు.ఎలాన్ మస్క్, ప్రపంచ ప్రఖ్యాత వ్యాపారవేత్త, ఆవిష్కర్త, అమెరికా అధ్యక్ష సలహాదారుగా తన పదవి నుంచి వైదొలగడం ఒక ముఖ్యమైన రాజకీయ సంఘటనగా నిలిచింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ' (డోజ్) శాఖ సారథిగా మస్క్ అందించిన సేవలు, అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో సామర్థ్యాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించాయి. అయితే, మే 30న తన పదవి గడువు ముగియడంతో, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మస్క్‌కు ఘనమైన వీడ్కోలు పలికారు. డోజ్ శాఖ అధ్యక్షుడు ట్రంప్ రెండో పదవీ కాలంలో ఏర్పాటైంది. దీని ప్రధాన లక్ష్యం ప్రభుత్వ వ్యయంలో వృథాను తగ్గించి, సామర్థ్యాన్ని పెంచడం. ఎలాన్ మస్క్, టెస్లా, స్పేస్‌ఎక్స్ సీఈవోగా తన అనుభవాన్ని ఉపయోగించి, ప్రభుత్వ వ్యవస్థలో సమూల మార్పులను సూచించారు. ఉదాహరణకు, అనవసరమైన ప్రభుత్వ ఉద్యోగాలను తొలగించడం, బడ్జెట్ కోతల ద్వారా ట్రిలియన్ డాలర్ల వథా ఖర్చును నియంత్రించడం వంటి సంస్కరణలను ప్రతిపాదించారు. ఈ సంస్కరణలు ప్రభుత్వ ఖర్చులను 20-30% వరకు తగ్గించే అవకాశం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి. అయితే మస్క్ వ్యాపార దృక్పథం, ఆవిష్కరణలు, సాంకేతిక నైపుణ్యం డోజ్ శాఖను ఒక ప్రత్యేకమైన సంస్థగా మార్చాయి. అయితే, ఈ సంస్కరణలు కొంతమంది వద్ద విమర్శలను కూడా రేకెత్తించాయి. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు సూచనలపై. మే 30న మస్క్ అధ్యక్ష కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంలో, ట్రంప్ ఆయనకు బంగారు రంగు తాళం చెవిని బహుమతిగా అందించారు. ఈ బహుమతి ప్రత్యేక వ్యక్తులకు మాత్రమే అందించబడుతుందని, ఇది దేశం తరపున మస్క్ సేవలకు గుర్తింపుగా ఇవ్వబడిందని ట్రంప్ తెలిపారు. ప్రెస్ మీట్‌లో మస్క్ అవిశ్రాంత కృషిని, ఆవిష్కరణలను, దేశ అభివృద్ధికి అందించిన సహకారాన్ని ట్రంప్ కొనియాడారు. ఈ గుర్తింపు మస్క్ యొక్క ప్రభావాన్ని మరియు డోజ్ శాఖ యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది.మస్క్ వైదొలగడం వెనుక బహుముఖ కారణాలు ఉన్నాయి. అమెరికా చట్టాల ప్రకారం, ఒక వ్యక్తి 130 రోజులకు మించి ఈ హోదాలో కొనసాగలేరు, ఇది మస్క్ పదవీ కాలం ముగింపుకు ఒక చట్టబద్ధ కారణం. అయితే, మీడియా కథనాల ప్రకారం, ట్రంప్ 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్ యాక్ట్' కు వ్యతిరేకతగా మస్క్ ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొనబడింది. ఈ బిల్ ప్రభుత్వ వ్యయాన్ని పెంచుతుందని, డోజ్ శాఖ లక్ష్యాలను నీరుగారుస్తుందని మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు. అదనంగా, కృత్రిమ మేధ సంస్థ ఓపెన్‌ఏఐ, యూఏఈ మధ్య ఒప్పందంపై మస్క్ వ్యతిరేకత కూడా ఒక కారణంగా చెప్పబడుతోంది. వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదిక ప్రకారం, మస్క్ ఈ ఒప్పందాన్ని ఆపాలని ట్రంప్‌పై ఒత్తిడి చేసినప్పటికీ, ట్రంప్ దానిని పట్టించుకోలేదని తెలుస్తోంది. ఈ విభేదాలు మస్క్ నిర్ణయంపై ప్రభావం చూపి ఉండవచ్చువీడ్కోలు సందర్భంలో మస్క్ తన భవిష్యత్తు ప్రణాళికలను వెల్లడించారు. అధ్యక్షుడు ట్రంప్ కోరినప్పుడు సలహాదారుగా, స్నేహితుడిగా తన సహకారాన్ని కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. అయితే, తన వ్యాపారాలపై మరింత దృష్టి పెడతానని, ముఖ్యంగా టెస్లా, స్పేస్‌ఎక్స్, ఎక్స్‌ఏఐ వంటి సంస్థల అభివృద్ధిపై దృష్టి సారిస్తానని తెలిపారు. డోజ్ శాఖ ఒక ముగింపు కాదని, ఇది కేవలం ఒక ప్రారంభమని మస్క్ పేర్కొన్నారు, ఇది భవిష్యత్తులో ప్రభుత్వ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.మస్క్ డోజ్ శాఖ నిర్వహణ కొంతమంది వద్ద విమర్శలను రేకెత్తించింది. ముఖ్యంగా, ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు సూచనలు, అతని జోక్యం పెరగడం వివాదాస్పదమైంది. కొందరు రాజకీయ విశ్లేషకులు మస్క్ ప్రభావం ప్రభుత్వ వ్యవస్థలో అసమతుల్యతను సృష్టించిందని వాదించారు. అయితే, మరికొందరు ఆయన సంస్కరణలు దీర్ఘకాలంలో ప్రభుత్వ ఖర్చులను తగ్గించి, సామర్థ్యాన్ని పెంచుతాయని సమర్థించారు.

## చెట్లు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది?

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణతో కలిసి సీఎం మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. మొక్కలు నాటిన తరువాత పర్యావరణ పరిరక్షణపై కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. రాఖీలు కట్టే చెల్లెమ్మలకు ఇకపై వారి అన్న నక్షత్రం పేరుకు తగ్గట్టుగా విత్తనాలు ఇస్తామని, ఈ ఏడాదిలోనే ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చూడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. నక్షత్రం చూసుకుని అన్నకు రాఖీ కడితే చెట్ల పెంపకానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంట్లో రూఫ్ టాప్ గార్డెన్ లేదా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చేపలు, చికెన్, ఇళ్లలో నుంచి వచ్చే వేస్ట్‌తో రీసైక్లింగ్కు ఉపయోగిస్తామని తెలిపారు.

## కాళేశ్వరం ప్రాజెక్టులో...

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడంతో, ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలున్నాయని, డిజైన్‌లో తప్పులున్నాయని, అంచనాలు పెంచేశారని, భారీగా అవినీతి జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం మార్చి 2024లో ఒక జుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఏకసభ్య కమిషన్‌గా ఏర్పాటు చేయబడిన దీనికి మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ అధిపతిగా వ్యవహరిస్తున్నారు.

**కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రధాన ఆరోపణలు**

మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం, పంపుహౌస్‌లు మునిగిపోవడం వంటి సంఘటనలు ప్రాజెక్టు డిజైన్‌లో, నిర్మాణంలో తీవ్రమైన లోపాలను ఎత్తి చూపుతున్నాయి. ప్రాజెక్టు అంచనా వ్యయం ప్రారంభంలో వేల కోట్ల రూపాయలు ఉండగా, అది లక్ష కోట్ల రూపాయలకు పైగా పెరిగింది. ఇందులో అవినీతి జరిగిందన్న ఆరోపణలున్నాయి. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలుఉన్నాయని, తక్కువ నాణ్యత కలిగిన సామగ్రిని ఉపయోగించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

ప్రాజెక్టు పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, ఇందులో ముఖ్య నేతలకు లబ్ధి చేకూరిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ పాత్రపై విచారణ

తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న సమయంలోనే ఈ కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. ఆయనే స్వయంగా ఈ ప్రాజెక్టును ఒక ఇంజినీర్‌గా రూపొందించారన్న ప్రచారం విస్తృతంగా సాగింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం సహా అన్ని విషయాల్లో కేసీఆర్ కీలకపాత్ర పోషించారన్నది ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భావన. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం, అంచనాల పెంపు, నిధుల్లో అవినీతి వంటి వాటిపై విచారణ జరిపేందుకు కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసింది.జూన్ 5వ తేదీన విచారణకు హాజరు కావాలని మొదట నోటీసుల్లో పేర్కొంది. అయితే, కేసీఆర్ విజ్ఞప్తి మేరకు కమిషన్ విచారణ తేదీని జూన్ 11కు మార్చింది. ప్రాజెక్టు రూపకల్పన దశ నుండి ప్రాజెక్టు ప్రారంభం వరకు జరిగిన అన్ని అంశాలపై కేసీఆర్‌ను కమిషన్ ప్రశ్నించే అవకాశం ఉంది. ప్రాజెక్టు నిర్ణయాలు, పర్యవేక్షణ వంటి అంశాల్లో ఆయన పాత్రపై ఆరా తీయనుంది. తెలంగాణ ఏర్పడిన తొలి ప్రభుత్వంలో హరీశ్ రావు నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన హయాంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభమైంది. ఈ ప్రాజెక్టు రూపకల్పన, నిర్మాణ పనుల పర్యవేక్షణ, అంచనాల పెంపు, పర్యవేక్షణ లోపాలు, మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం వెనుక గల కారణాలు, నిధుల్లో అవకతవకల ఆరోపణలు వంటి అంశాలపై కాళేశ్వరం కమిషన్ విచారణ జరపనుంది. జూన్ 9వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆయనకు నోటీసులు జారీ చేసింది. ప్రాజెక్టు అమలులో మాజీ మంత్రి హరీశ్ రావు పాత్ర, ఆయన నిర్ణయాలు, బాధ్యతలపై కమిషన్ దృష్టి సారించనుంది.కేసీఆర్ తొలి కేబినెట్‌లో ప్రస్తుత బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పనిచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన, వ్యయ అంచనాలు, ఆర్థిక శాఖ అనుమతుల జారీ, నిధుల పంపిణీ, బడ్జెట్ కేటాయింపులు, ఆర్థిక అవకతవకలపై ఆరోపణలు వంటి అంశాలపై విచారణకు ఈటల రాజేందర్‌ను కమిషన్ ప్రశ్నించనుంది. జూన్ 6వ తేదీన విచారణకు హాజరు కావాలని కాళేశ్వరం కమిషన్ నోటీసుల్లో పేర్కొంది.కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈ విచారణ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మాజీ సీఎం కేసీఆర్ కమిషన్ ఎదుట హాజరు కావాలని నిర్ణయించుకోవడం ఇప్పుడు మరింత చర్చకు దారితీసింది.

## రేషన్.. పరేషాన్...

ఇవ్వడంతో ఉదయం ఆరు గంటల నుంచే క్యూలో నిల్చొని, సర్వర్ ప్రాబ్లం ఉండడంతో గంటల తరబడి క్యూ లైన్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎందుకు ఆలస్యమవుతుందని రేషన్ డీలర్ లను నిలదీయగా, సర్వర్ ప్రాబ్లం ఉందని సాంకేతిక నిపుణులు వచ్చి సరి చేసేవరకు ఏం చేయలేమని సమాధానం ఇస్తున్నారు. కూలి పనులు, ఉద్యోగాలు మానుకొని లైన్ లో నిలుచుంటున్నామని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల రేషన్ ఒకేసారి ఇచ్చేముందు సాంకేతిక లోపాలను సరిచేసుకోవడం తెలియదా అంటూ ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రేషన్ ఇచ్చే ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణలో సన్న బియ్యానికి మంచి డిమాండ్ ఏర్పడింది. రేషన్ దుకాణాల్లో తెలుపు రంగు రేషన్ కార్డు



దారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో ప్రజలు హ్యాపీ ఫీలవుతున్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇచ్చేటప్పుడు ఇంతటి రష్ ఉండేది కాదని రేషన్ దుకాణాల డీలర్లు చెబుతున్నారు. చాలా వరకూ బియ్యాన్ని తీసుకునే వారు కాదని, కొందరు తీసుకున్న బియ్యాన్ని బయట వ్యాపారులకు విక్రయించే వారని చెబుతున్నారు.సన్న బియ్యం కావడంతో... సన్న బియ్యం కావడంతో అందులోనూ ఉచితంగా ఇవ్వడం, ఇంట్లో ఎంత మంది ఉన్నప్పటికీ ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తుండటంతో సన్న బియ్యానికి మంచి డిమాండ్ ఏర్పడింది. తెలంగాణలో మొత్తం 90 లక్షలకు పైగా రేషన్ కార్డులున్నాయి. అందులో మూడుకోట్ల మందికి సన్నబియ్యాన్ని తెలంగాణ ప్రభుత్వం అందిస్తుంది. ప్రతినెల రేషన్ దుకాణాలకు రెండు లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తుంది. ఎక్కడా బియ్యం కొరత అంటూ లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొత్త రేషన్ కార్డులు వస్తే మరో ముప్ఫయి లక్షల మంది లబ్దిదారులు పెరిగే అవకాశముంటున్నారు. ఈ సన్నబియ్యం పథకం కోసం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మొత్తం 10,615 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. అందులో రాష్ట్ర ప్రభుత్వం ఐదు వేలకోట్ల రూపాయలను ఖర్చుచేస్తుంది. అదనంగా ప్రభుత్వం పై మూడు కోట్ల రూపాయలు భారం పడినప్పటికీ గతంలో అరవై శాతం మంది మాత్రమే రేషన్ బియ్యం తీసుకునే వారని, ఇప్పుడు వందశాతం మంది తీసుకోవడం పథకం సూపర్ సక్సెస్ అయిందని చెప్పడానికి ఉదాహరణ అని ప్రభుత్వ వర్గాలు అందనున్నాయి. ఇదే సమయంలో మూడు నెలల పాటు భారీ వర్షాలు, వరదలు ఉంటాయని భావించి మూడు నెలలకు ఒకేసారి సన్న బియ్యం ఇస్తుండటంతో దీనికి డిమాండ్ ఏర్పడింది. అందుకే రేషన్ దుకాణాల వద్దకు క్యూ కడుతున్నారు. అనేక చోట్ల రద్దీ ఎక్కువగా ఉండటంతో బియ్యం తీసుకునేందుకు ఎక్కువ సమయంపడుతుంది.

# బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి

- తుర్కపల్లి పనులను పరిశీలిస్తున్న సిపి, కలెక్టర్

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 5 :**

తుర్కపల్లి మండలం తిరుమలపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సీఎం బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం ఆయన సీఎం సభ ఏర్పాటు పనులను పరిశీలించి అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల ఆరవ తేదీన ఆలేరు నియోజకవర్గానికి సంబంధించి 1500 కోట్ల విలువైన పనులకు సీఎం రేవంత్ రెడ్డి తిరుమలాపురం గ్రామంలో శంకుస్థాపన చేస్తున్నట్టు తెలిపారు. సభ స్థలం పక్కనే శిలాఫలకాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇట్టి బహిరంగ సభ ఏర్పాటుకు గురువారం సిపి సుధీర్ బాబు, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, జెసిలు వీరారెడ్డి, భాస్కర్ రావు, ఆర్ అండ్ బి ఈ బాల ప్రసాద్, ఇరిగేషన్ ఎస్సీ శ్రీనివాస్ పనులను పూర్తిస్థాయిలో పరిశీలన చేసినట్టు తెలిపారు. తిరుమలాపురం శివారులోని 30 ఎకరాల విస్తీర్ణంలో వేదిక వేసి పనులు ముమ్మరంగా చేసి పూర్తి చేసినట్టు తెలిపారు. హెలిపాడ్ కోసం 10 గుంటల స్థలాన్ని కేటాయించి కాంక్రీట్ తో సర్కిల్ ను ఏర్పాటు చేశారు. వర్షాకాలం కావడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా నాలుగు రైన్ ప్రూఫ్ టెంట్లు వేశారు. మధ్యలో సభికులు వీక్షించేలా రెండు పెద్దవి, రెండు చిన్నవి ఎల్ఈడి తెరలను ఏర్పాటు చేశారు. రెండు పార్కింగ్లో వీరారెడ్డిపల్లి, రెండు పార్కింగ్లు తిరుమలపూర్ వైపు చేశారు. స్టేజి పైన 100 మంది వీఐపీలకు కుర్చీలను ఏర్పాటు చేశారు. లబ్దిదారులకు 20 వేల కుర్చీలను ఏర్పాటు చేశారు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు లబ్ధిదారులను 20,000 మందిని ఆ సభకు తరలిస్తున్నట్లు తెలిపారు. 30 వేల మంది కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజలు హాజరవుతున్నారని తెలిపారు. 15 మంది లబ్ధిదారులకు సాంప్రదాయ దుస్తులతో వారికి ముఖ్యమంత్రి స్టేజి పైన ప్రొసీడింగులను అందజేస్తారు. పోలీసులు ప్రతిష్ట బంధ బస్సు ఏర్పాటు చేస్తున్నారు. ఐదుగురు డిఎస్పీలు, 12 మంది అదనపు డిఎస్పీలు, 20 మంది ఏసీపీలు, 50 మంది సీఐలు, 150 మంది ఎస్ఐలు, సివిల్, ట్రాఫిక్ తో కలిపి మొత్తం 1500 మంది పోలీసులు కట్టుదిట్టమైన రక్షణ కల్పించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మూడు గంటల ఐదు నిమిషాలకు హెలికాప్టర్లో సభా స్థలానికి చేరుకుంటారని తెలిపారు. మూడు గంటల ఏడు నిమిషాలకు సీఎంకు పూర్ణకుంభంతో స్వాగం పలుకుతారు. 3 : 20 వరకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని అన్నారు. 3: 30 నిమిషాలకు ప్రభుత్వ విప్ బీర్ల స్వాగత ఉపన్యాసం చేస్తారు. 3 45 నిమిషాలకు మంత్రుల ప్రసంగం. 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారు.





# బహిరంగ సభను విజయవంతం చేయాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**జయభేరి, తుర్కపల్లి, జూన్ 5 :**

తుర్కపల్లి మండలం తిరుమలపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిలు అన్నారు.

గురువారం తిరుమలాపూర్ గ్రామంలో ముఖ్యమంత్రి బహిరంగ సభాసలిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ ఏర్పాట్లను పూర్తిగా చేసినట్లు తెలిపారు. ఆలేరు నియోజకవర్గానికి 1500 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి వస్తున్న ముఖ్యమంత్రి కి 60 నుంచి 70 వేల మంది తరలివచ్చి సభను విజయవంతం చేయాలని అన్నారు. ఒకవైపు అభివృద్ధి, ఒకవైపు సంక్షేమము ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి వస్తున్నారని అన్నారు. గత 15 సంవత్సరాల్లో ఆలేరు పూర్తిగా వెనుకబడి పోయిందని, 15 మండలాల కోసం 30 ఏళ్ల కల నెరవేరడానికి గంధ మల్ల రిజర్వాయర్ ను 1.41 టీఎంసీల తో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. 1000 ఎకరాల భూమిలో 1.41 టీఎంసీలతో 700 కోట్ల రూపాయలతో ప్రాజెక్టు నిర్మాణము, 153 కోట్ల తో మెడికల్ కాలేజీ, 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, 46 కోట్లతో వేద పాఠశాల, 30 కోట్లతో గోదాములు, కొలనుపాక, కాల్వపల్లి బ్రిడ్జిలకు 15 కోట్లు, మోటకొండూరు ఎమ్మార్వో, ఎంపీడీవో, పోలీస్ స్టేషనులకు 15 కోట్లు, 18 కోట్లతో వనపర్తి రోడ్డు, 18 కోట్లతో యావాపూర్ రోడ్డు, నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. ప్రజా పాలనా ప్రజల పాలన అని అన్నారు. తప్పుడు ప్రచారానికి బీఆర్ఎస్ నాయకులు పరిమితమైనారని అన్నారు. కెసిఆర్ మిగులు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే, రేవంత్ రెడ్డి అప్పుల రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినారని అన్నారు. 21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని అన్నారు. నియంత పోకడలకు పోయిన కేసీఆర్ ప్రజలే గుణపాఠం చెప్పారని, అన్నారు అప్పటి ముఖ్యమంత్రి పగటి కలలు కన్నారని అన్నారు. మూడున్నర ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని అమలు చేస్తామని అవి అమలు పూర్తిచేసి మరొకసారి ముఖ్యమంత్రిగా గెలిపిస్తామని అన్నారు. నీరు, విద్యా, వైద్యం, రోడ్లు గత ప్రభుత్వం లో చేయని కేజీ టు పీజీ విద్యను జనం అందించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్నామని అన్నారు. ప్రజా పాలన అంటే ఫామ్ హౌస్ లో పడుకొని చేయడం కాదు అని ప్రజల్లోకి వచ్చి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ,రాష్ట్ర అధికార ప్రతినిధి బొజ్జ సంధ్యారాణి, నాయకులు ధనావత్ శంకర్ నాయక్ ,చాడ భాస్కర్ రెడ్డి, ప్రమోద్ కుమార్ ,కానుగంటి శ్రీనివాస్ యాదవ్, , ధనావత్ భాస్కర్ నాయక్, బాల్రాజ్ గౌడ్, భరత్ గౌడ్, ముక్కెర్ల మల్లేష్, గంధం అశోక్, బొత్త రాములు, డొంకెన వెంకటేష్, రామగోని వెంకటేష్ గౌడ్, దేవరుప్పల ఐలయ్య, నాయకులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.







# భూ భారతి రెవెన్యూ సదస్సు

**జయభేరి, దేవరకొండ :**

భూ భారతి రెవెన్యూ సదస్సులో భాగముగా దేవరకొండ డివిజన్ తహశీల్దార్లతో రాజస్వ మండలాధికారి దేవరకొండ సమీక్ష సమావేశము ఏర్పాటు చేసి రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను త్వరతగతిన పరిశీలించి భూభారతి పోర్టల్ నందు ఆన్లైన్ చేయుటకు మరియు తదితర అంశములపై సమీక్ష సమావేశము నిర్వహించినారు.

# మాదక ద్రవ్యాల ముఠా అరెస్టు



**జయభేరి, విజయవాడ:**

డ్రగ్స్ తరలిస్తున్న ముఠాను పటమట పోలీసులు అరెస్టు చేసారు. ముగ్గురు అరెస్టు, రెండు లక్షలు విలువ చేసే డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. డిసిపి సరిత మాట్లాడుతూ ఎపి ప్రభుత్వం మాదక ద్రవ్యాలు రవాణా పై ఉక్కుపాదం మోపుతుంది. ఎప్పటికప్పుడు తనిఖీలు చేయడంతో పాటు రవాణా నిరోధించే చర్యలు చేపట్టాం. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎండిఎంయే డ్రగ్స్ దొరికాయి. ఈ డ్రగ్స్ తీసుకొవడం వల్ల ఓవర్ గా ఊహించుకుని అతిగా ప్రవర్తిస్తారు. వాహనాల తనిఖీ సమయంలో ముగ్గురు వ్యక్తులు డ్రగ్స్ తీసుకు వెళుతున్నట్లు గుర్తుంచారని అన్నారు.

ఎసిపి దామోదర్, సీఐ పవన్ కిషోర్ లు వారిని విచారణ చేసి అరెస్టు చేశారు. తిరుమలశెట్టి జీవన్ కుమార్, నితీష్ కుమార్, ప్రసాద్ లు అరెస్టు అయ్యారు. 33 గ్రాముల డ్రగ్స్ వారి నుంచి స్వాధీనం చేసుకున్నాం.యూనివర్శిటీ లో విద్యార్థులు కు ఈ డ్రగ్స్ అమ్ముతున్నట్లు విచారణ లో తేలింది. ఈ తరహా డ్రగ్స్, గంజాయి ఎక్కడ తీస్తున్నారు, ఎక్కడకు చేర్చుతున్నారు అనే అంశాలపై దృష్టి పెట్టాం. ఈరోజు దొరికిన డ్రగ్స్ కొరియర్ లో ప్యాక్ చేసి పంపారు. అది పైకి ప్యాకెట్ లాగానే ఉంటుంది.. లోపల చూస్తేనే అర్ధం అవుతుంది. ఇటువంటి డ్రగ్స్ రవాణా చేసినా, సేవించినా కఠిన చర్యలు ఉంటాయి. గంజాయి రవాణా పై ఇప్పటికే పీడీ యాక్ట్ కేసులు పెట్టాం. ఇప్పుడు కొత్తగా క్విట్ అండ్ పిటి యాక్ట్ అమల్లోకి వచ్చింది. ఎన్డీపిటీఎస్ కింద పలు కేసులు నమోదు అయ్యాయి. బైక్ దొంగతనాలు చేసి, వాటి ద్వారా గంజాయి రవాణా చేస్తున్నారు. బైక్ లు చోరీకి గురైనా వెంటనే పోలీసులు కు సమాచారం ఇవ్వండి. ఎవరికైనా గంజాయి, డ్రగ్స్ సమాచారం తెలిసినా పోలీసులు కు చెప్పండి. ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్ కు బానిస కావద్దు, జీవితాలు నాశనం చేసుకోవద్దు. మీరు డ్రగ్స్ చేరవేసినా కూడా కఠిన శిక్షలు ఉంటాయని అన్నారు. ఈవ్ టీజింగ్ అరికట్టిన విధంగా కాలేజ్ ల్లో డ్రగ్స్ అరికట్టాలి. ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేసుకుని సమన్వయం తో పని చేయా. డ్రగ్స్ ఫ్రీ స్టేట్ గా చేయాలన్న ప్రభుత్వం ఆలోచనకు పోలీసులు పని చేస్తున్నారు. ప్రజలు కూడా ఈ తరహా అంశాల పై అవగాహన పెంచుకుని పోలీసులు కు సహకారం అందించాలి. ఈ ముఠా వెనుక కొంతమంది ఉన్నారు.. దర్యాప్తు జరుగుతుందని అన్నారు.

# ఎస్ ఎన్ ఎఫ్ ఫార్మాలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

**జయభేరి, పరవాడ :**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, ఎస్ ఎన్ ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జెఎన్ పి సి పరవాడ వద్ద ఉద్యోగులు మరియు కాంట్రాక్ట్ వర్కర్లు సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రతి ఉద్యోగి, కార్మికుడు వ్యక్తిగతంగా ఒక్కొక్క మొక్కను నాటారు, ఇది కంపెనీ యొక్క పర్యావరణ సంరక్షణ పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. అదనంగా, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల వాడకాన్ని తగ్గించేందుకు, అందరు ఉద్యోగులు, కార్మికులకు జనపనార బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెడ్ ఆఫ్ హె చ్ ఆర్, కార్పొరేట్ సర్వీసెస్ శ్రీమతి అనితా సాహు, హెడ్ ఆఫ్ ఈ హె చ్ ఎస్ అప్పలనాయుడు, ఫ్యాక్టరీ మేనేజర్ పాండవ ప్రసాద్ పాల్గొన్నారు.

మొక్కలు నాటడం, జనపనార బ్యాగ్‌ల పంపిణీ ద్వారా, ఎస్ ఎన్ ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పర్యావరణ పరిరక్షణ, సుస్థిరతను ప్రోత్సహించడంలో తమ వంతు కృషి చేసింది. కార్యక్రమంలో పాల్గొన్నవారు పర్యావరణ సమతుల్యతను కాపాడటం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేశారు. ఎస్ ఎన్ ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ భవిష్యత్తులో కూడా ఇలాంటి పర్యావరణ అవగాహన కార్యక్రమాలను కొనసాగించడానికి కట్టుబడి ఉందని అన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో స్థానికులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.






# రేషన్ డీలర్లు టోకెన్ వ్యవస్థను అనుసరించాలని సూచన

- కేశవరం గ్రామంలో రేషన్ దుకాణాన్ని పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్

**జయభేరి, శామీర్ పేట్, జూన్ 5 :**

రేషన్ దుకాణాలలో సన్న బియ్యం ఒకే సారి పంపిణీ చేయనున్నందున రేషన్ కార్డ్ దారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి రేషన్ డీలర్లకు సూచించారు. మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలో చౌకధరల దుకాణాన్ని పరిశీలించిన ఆయన డీలరు టోకెన్ వ్యవస్థను అనుసరించాలని, ఎంఎల్ఎస్ పాయింట్ల సమన్వయంతో బియ్యం నిల్వల ముందస్తు స్థానాన్ని అనుసరించాలని సూచించారు. మూడు నెలల కాలానికి ఒకేసారి పంపిణీ చేస్తున్నందున ప్రతి షాపులో తగినంత స్టాకును నిల్వలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని, సరిపడా స్టాక్ లేని పక్షంలో సత్వరమే సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి, తెప్పించుకోనుటకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కేశవరం గ్రామంలోని వరి, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో తహసీల్దార్ వెంకట నర్సింహా రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోనె హనుమత్ రెడ్డి,గ్రామస్తులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మొక్కలు పెంపకంతోనే సాధ్యం



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం రావాడ గ్రామ పంచాయతీ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్నా ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కలు నాటడం జరిగింది. వియ్యపు చిన్నా మాట్లాడుతూ ప్రకృతుని ప్రేమించండి పర్యావరణాన్ని పరిరక్షించాలని , నేడు ఒక్క మొక్కని నాటి రేపటికి ఆరోగ్యకరమైన భవిష్యత్ కు దారి వేద్దాంఅని ప్రకృతిని కాపాడుకునేది మన అందరి భాధ్యత అని చెప్పడం జరిగింది.పచ్చని చెట్లు ప్రగతి కి మెట్లు చెట్లు బాగా పెంచాలి అని చెప్పారు. ఈ కార్యక్రమం లో కోన కృష్ణ గ్రామ పెద్దలు సాలాపు రమణ,మరిసా అప్పలరాజు, మోటురు అప్పారావు, మొటూరు సూరి బాబు, మరిసా యర్రయ్య నాయుడు, మరిసా అప్పలరాజు, ద్వార పూడి ఆచార్యలు, పోలవరపు చిన్నారావు, మరిసా చిన్నమ్మ లు, తోట రమణమ్మ పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాలలో కార్పొరేటర్ రౌతు




**జయభేరి, పరవాడ:**

జీవీఎంసీ 79 వ వార్డు పరిధి అగనంపూడి, గళ్ళవానిపాలెం, షిరిడి సాయి నగర్ లలో ప్రపంచ పర్యావరణ దినోత్సవము సందర్భంగా ర్యాలీ నిర్వహించి, జన చైతన్య కాలనీ వాకింగ్ ట్రాక్ ఏరియాలో మొక్కలు నాటి స్థానిక ప్రజలందరితో ప్రమాణము స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి మొక్కలు నాటి చెట్లను సంరక్షించాలని, ప్లాస్టిక్ వాడుకను నిషేధించాలని, తడి పొడి మరియు ప్రమాదకరమైన చెత్తను మీ వీధిలోకి వచ్చే బండికి ఇవ్వాలని, ప్రతి నీటి బొట్టు ను ఆదా చేయాలనీ, ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది, డ్వాక్రా ఆర్ పి లు, సానిటరీ S.S. కోటేశ్వరరావు, మరియు సిబ్బంది, తెలుగుదేశం జనసేన వార్డు అధ్యక్షులు, కరణం జగదీష్, మేడిశెట్టి విజయ్, బిజెపి నాయకురాలు కుమారి, మరియు ఉమ్మడి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**జయభేరి, పరవాడ:**

పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఈ బోనంగి విఎంఆర్ డిఏ బల్క్ ల్యాండ్ అండ్ పవర్ సిటీ వద్ద శ్రీ సిద్ధి వెంకటేశ్వర ఆర్టికల్చర్ అండ్ సివిల్ వర్క్స లాలం అప్పలనాయుడు, ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంకి ముఖ్య అతిధిగా మండల జనసేన పార్టీ ఇంచార్జి పంచకర్ల ప్రసాద్ పాల్గోని పర్యావరణ పరిరక్షణకి అందరు మొక్కలు నాటలని పచ్చని చెట్లు ప్రకృతి ఆహ్లాదాన్ని పంచడమే కాకుండా వీటి ద్వారా ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయని, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ఇంటికొక మొక్క నాటే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ బోనంగి సర్పంచ్ బొద్ధపు శ్రీనివాస్, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి బుగిడి రామ గోవిందరావు, మాజీ ఎంపిటిసి గొర్లె శ్రీనివాస్, పైలా రామారావు, మేడశెట్టి అప్పారావు, లాలం అప్పలనాయుడు,కూండ్రపు సోమనాయుడు, మేడిశెట్టి బాలాజీ నాయుడు, రెడ్డి శ్రీనివాసరావు,చుక్కా గోపి మరియు SGL నగర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత జయభేరి



## చెట్లు నాటుధాంపచ్చదనాన్ని పెంచుద్దాం

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో 4వ రోజు దేవరకొండ పురపాలక సంఘం ఖిల్లా పార్క్ యందు ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా woman for trees లో భాగంగా మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్ మాట్లాడుతూ "చెట్లు నాటుధాంపచ్చదనాన్ని పెంచుద్దాం" తడి చెత్త పొడి చెత్త వేరు చేయుట , సీజీనల్ వ్యాదులు రాకుండా ముందు జాగ్రత్తలు పాటించవలసిన వంటి విషయాలపై అవగహాన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమం తర్వాత ఖిల్లా పార్క్ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మరియు Women for tree కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుట కార్యక్రమం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సక్రు నాయక్, మెప్మా టీఎంసీ జగమంతు, మున్సిపల్ స్టాఫ్. మెప్మా ఆర్.పి.లు,. మహిళా సంఘ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## నూతన ఆలయ ప్రారంభోత్సవం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలంలోని తెల్దేవరపల్లి (సెంటర్) గ్రామంలో శ్రీశ్రీశ్రీ సీతారాముల శివాలయ ఆంజనేయ స్వామి ల వారి నూతన ఆలయ ప్రారంభోత్సవం, ధ్వజస్తంభ నిర్మాణం 2,60,000రూ,, అక్షరాల రెండు లక్షల అరవై వేల రూపాయలతో చేయించిన దాతలు జాలే బ్రదర్స్ నరసింహారెడ్డి తిలక్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీశ్రీశ్రీ సీతారాముల శివాలయ ఆంజనేయ స్వామి ల వారిని దర్శించుకొని వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించిన జాలే నరసింహారెడ్డి పీసీసీ సభ్యులు PACS చైర్మన్. ఈ సందర్భంగా నరసింహారెడ్డి ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, ఇప్ప తిరుపతి రెడ్డి, బందేల తిరుపతయ్య, మరియు తదితరులు పాల్గొన్నారు.


## నత్తనడకన సాగుతున్న పరీక్షల ఫలితాలు



**జయభేరి, దేవరకొండ :**

పరీక్షల సంబంధిత సమాచారం నెలకొకటి చొప్పున విడుదల చేస్తూ, నిరుద్యోగులను అసహనానికి గురి చేస్తూ,నానా అగచాట్లు పెట్టిస్తున్న ఆరోగ్య శాఖ బోర్డు ఎం.హెచ్.ఎస్.ఆర్.బి. ఫోన్ చేస్తే సమయం పడుతుంది కానీ ఎప్పుడో తెలియదంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్న బోర్డు అధికారులు. వైద్య ఆరోగ్య శాఖలోని ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, నర్సింగ్ ఆఫీసర్ ,ఏఎన్ఎం ఉద్యోగాలకు సంబంధించి గత సంవత్సరం చివర నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదల చేయడానికి మీనమేషాలు లెక్కిస్తూ తమ జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అభ్యర్థులు వాపోతున్నారు. కీ పేపర్ విడుదల చేసి చేతులు దులుపుకున్నారని, అసలు రిజల్ట్ ఇచ్చే ఉద్దేశం ఉందో లేదో తెలియడంలేదంటూ అభ్యర్థులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఫలితాలు ఇంకా ఆలస్యం చేస్తారేమోనని అభ్యర్థులు భయపడుతున్నారు. ఇప్పటికైనా త్వరితగతిన ఫలితాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## పూస్తే మట్టెలు అందజేతా



**జయభేరి, వర్గల్, జూన్ 04 :**

పెండ్లికి పూస్తే మట్టెలు అందజేసి శ్రీ నూతన గౌడ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుండుకాడి వెంకటేష్ గౌడ్ అండగా నిలిచారు. వర్గల్ మండలం వేలూరు గ్రామానికి చెందిన బాలయ్య కూతురు తప్పేట్ల వరలక్ష్మీ వివాహానికి పూస్తే మట్టెలు అందజేసి ఆర్థికగా తోడున్నారు. ఆడ బిడ్డలకు పూస్తే మట్టెలు సహాయం చేస్తూ తన మానవత్వాన్ని చాటుకున్నారు. దయానియ స్థితిలో ఉన్న ఆ పేద కుటుంబాన్నీ అదుకోవడానికి చిరు సహాయం అందించామన్నారు. వీలైనంత వరకు సహాయం చేస్తానని వారు తెలిపారు.

# ఉపాధి హామీ పథకాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి డిమాండ్

**జయభేరి, పరవాడ:**




పరవాడ.గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని, బకాయి పడ్డ ఎనిమిది వారాల వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడ మండలం కలపాక గ్రామంలో ఉపాధి హామీ పథకాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని , ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్లో రెండు లక్షల కోట్లు కేటాయించాలని కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, 8 వారాల బకాయి వేతనాలు చెల్లించాలని నినాదాలు చేశారు.

గురువారం జరిగిన ఈ ధర్నాని ఉద్దేశించి గని శెట్టి మాట్లాడుతూ.. రూ 600 రోజుకి వేతనం చెల్లించాలని పే స్లిప్పులు ఇవ్వాలని గని శెట్టి డిమాండ్ చేశారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో కూలీల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం తక్షణమే సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం కూలిలకు సకాలంలో బిల్లులు చెల్లించడం లెదన్నారు గత మూడు సంవత్సరాలుగా బడ్జెట్లో నిదులకు కోత విదించి మేటిరియల్ చార్జీలు పెంచేసారని తెలిపారు దింతో ముందుగా కాంట్రాక్టర్లుకు బిల్లులు ముందు చెల్లించి కూలీలను తర్వాత చెల్లిస్తున్నారని తెలిపారు, 40 శాతం సమ్మర్ ఎలవెన్సులు అధికంగా చెల్లించాలన్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంటు, మంచినీరు, ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తట్టా, పారా, గునపాపం టెంట్లు వంటి వాటికి కోత పెట్టారని తెలిపారు. రవాణా చార్జీలు కూడా ఎత్తివేయడం దుర్మార్గం అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలను కార్మికులు అడ్డుకోవాలని గని శెట్టి పిలుపునిచ్చారు.

కేటాయిస్తున్న నిధులు కూడా 2019 20 లో 71 వేల కోట్లు కేటాయించగా 2024 కి వచ్చేసరికి పెంచకపోగా రూ 68వేల కోట్లకు తగ్గించారు. ఉపాధి హామీ కార్మికులు ఐక్యంగా పోరాడి పథకాన్ని కాపాడుకోవాలని అన్నారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించకపోతే భారీ ఎత్తున ఆందోళన చేపడతామని గనిశెట్టి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

# పొన్నాల, లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో రెవెన్యూ సదస్సులు

- భూ సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దని సూచన

**జయభేరి, శామీర్ పేట్, జూన్ 5 :**




భూ భారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో వచ్చే ఆర్జీదారులతో సౌమ్యంగా వ్యవహరించాలని, వారికి అవసరమైన సలహాలు, సూచనలను అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సూచించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో భాగంగా గురువారం శామీర్ పేట మండలం పొన్నాల గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సును కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారంలో ఎలాంటి అలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించి రైతులకు ప్రభుత్వంపై భరోసా కల్పించాలని, భూ భారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించాలని అన్నారు. అదేవిధంగా రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే ఆన్లైన్ లో నమోదు చేయాలని, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు ఆయన సూచించారు. ఈ సదస్సుల ద్వారా రెవెన్యూ రికార్డ్ లను సక్రమంగా నిర్వహించుటకు అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులు ఏవిధంగా ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారని రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆర్జీలను నిర్ధేశిత కోడ్‌లలో నమోదు చేయాలని, రైతులకు సంబందిత డాక్యూమెంట్లను జతచేయాలని తెలియజేయాలన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి అయినట్లు దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకోని, ప్రభుత్వ భూముల పరిరక్షణకై పాటుపడాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. ఆర్జీలు సమర్పించిన ప్రతి దరఖాస్తుదానికి రశీదులు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ తహసిల్దార్ యాదగిరిరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ సంయుక్త, ఆర్ ఐ లు రాఘవ, కవిత, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ఇవ్వాలి

**జయభేరి, దేవరకొండ :**




దేవరకొండ పట్టణంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సామాజిక వేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కొమరం భీం జిల్లాలో జన్మించిన కొండా లక్ష్మణ్ బాపూజీ విద్యార్థి దశ నుండే నాయకులుగా ఉండి ప్రజలకు, విద్యార్థులకు ఉద్యమాలలో పాల్గొని ఎన్నో సేవలు అందించారు. నిజాం నిరంకుశత్వానికి ఎదురొడ్డి తెలంగాణ సాయుధ పోరాటంలో, భారత దేశ స్వాతంత్ర పోరాటంలో ముందుండి నడిపించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం మొట్టమొదటగా జలదృశ్యంలో తొలి సమావేశం ఏర్పాటు చేసి కేసీఆర్ తో తెలంగాణ ఉద్యమ కార్యచరణ తయారు చేసి తెలంగాణ రాష్ట్ర సాధన సిద్ధించే వరకు పోరాటం చేసిన గొప్ప నాయకుడు. ఈయనకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇవ్వాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ రాష్ట్ర జాతిపితగా గుర్తించి ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చోల్లేటి భాస్కరాచారి, పున్న వెంకటేష్ నేత,అప్పం వీరయ్య ,ఎండి అబ్దుల్ కలాం ,మాకం చంద్రమౌళి ,గండూరి లక్ష్మణ్ ,ఎండి ఖాదర్ , సిహెచ్ ఎల్లయ్య , కొండ్రపల్లి శీను , బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.



## అవినీతి జలగలు పైసలు ఇవ్వనీదే పని జరగని వైనం

- 20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ బిల్ కలెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్

**జయభేరి, శామీర్ పేట్, జూన్ 5 :**

ప్రభుత్వ అధికారులకు వేతనాలు చెల్లిస్తున్న కూడా కొందరు ధనమే లక్ష్యంగా అడ్డదారులు తొక్కుతున్నారు. ఇటీవల చాలా మంది లంచాలు తీసుకుంటూ ఏసీబీ అధికారుల వలలో చిక్కిన కూడా కొంతమంది అధికారుల్లో ఏ మాత్రం మార్పు కనిపించడం లేదు. తాజాగా తుంకుంట మున్సిపాలిటీ లోని శామీర్ పేట లో బిల్ కలెక్టర్ గా పని చేస్తున్న రాంరెడ్డి మరియు కంప్యూటర్ ఆపరేటర్ శ్రవణ్ లు 20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. 2 ఇళ్లను కొనుగోలు చేసిన ఓ వ్యక్తి అనంతరం మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా దాని కోసం 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా సదరు బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో లంచం తీసుకుంటున్న బిల్ కలెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్ లను రెడ్ హ్యాండెండ్ గా పట్టుకున్నారు. అయితే ఈ కేసులో ఇంకెవరన్న ఉన్నారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఎవరైనా లంచం అడిగిన నేరుగా ఏసీబీ అధికారులను ఆశ్రయించాలని ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు.

## సభలో నుండి ఇతర పార్టీ నాయకులు వెళ్లిపోవడం విచిత్రం

- జిహెచ్ఎంసి కౌన్సిల్ సమావేశంలో నగరంలో ఉన్న సమస్యలపై మాట్లాడుతున్న GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్,కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి



**జయభేరి, ఎల్బీనగర్ :**

కౌన్సిల్ ముగిసిన అనంతరం మీడియా పాయింట్ వద్ద కార్పొరేటర్ నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ.. మేయర్ సభ రాత్రి 10:00 గంటల వరకు కొనసాగిస్తామని చెప్పారు. కానీ, కాంగ్రెస్, BRS, MIM సభ్యులు 10 మంది కూడా సభలో లేకపోవడంతో మా బిజెపి కార్పొరేటర్లు 30 మంది ప్రస్తుత సభలో ఉండడంతో, ఎక్కడ సమస్యలు లేవనెత్తి ఇంకా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారు అని చెప్పి 7:00 గంటలకే కౌన్సిల్ను ముగించడం బాధాకరంగా భావిస్తూ, నగరంలో ఎన్నో సమస్యలు ఉన్నా కానీ సమస్యలను లేవనెత్తకుండా కొనసాగుతున్న సభలో నుండి ఇతర పార్టీ నాయకులు వెళ్లిపోవడం విచిత్రంగా ఉందని భావిస్తూ మేయర్, అధికారులు వెంటనే మేము లేవనెత్తిన సమస్యలపై దృష్టి సారించి పరిష్కార దిశగా ముందుకు వెళ్లాలని బిజెపి కార్పొరేటర్ తో కలిసి మీడియా మిత్రులకు తెలియజేశారు.




## విశాల్‌కు భారీ షాక్.. లైకాకు రూ.21 కోట్ల అప్పు చెల్లించాలని మద్రాస్ హైకోర్టు ఆదేశం!

తమిళ నటుడు విశాల్, ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ మధ్య నడుస్తున్న వివాదంలో మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. లైకా ప్రొడక్షన్స్‌కు రూ.21.29 కోట్ల అప్పును 30% వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని విశాల్‌ను హైకోర్టు ఆదేశించింది.

అసలు ఏం జరిగిందంటే.. విశాల్ తన 'విశాల్ ఫిలిం ఫ్యాక్టరీ' కోసం ఫైనాన్షియర్ జి.ఎన్. అన్బు చెళియన్ 'గోపురం ఫిలిమ్స్' వద్ద రూ.21.29 కోట్లు అప్పుగా తీసుకున్నారు. ఈ అప్పును లైకా ప్రొడక్షన్స్ స్వీకరించి, విశాల్ తన అప్పు తీర్చే వరకు విశాల్ నిర్మించే సినిమా హక్కులన్నీ తమకు చెందే విధంగా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అయితే, విశాల్ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ.. వీరమై వాగై చూడమ్ (తెలుగులో సామాన్యుడు) అనే సినిమా హక్కులను లైకాకు బదులుగా ఇతర సంస్థలకు అమ్మాడని లైకా ప్రొడక్షన్స్ ఆరోపించింది. దీంతో 2022లో లైకా ప్రొడక్షన్స్ ఈ వివాదంపై మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. అయితే ఈ కేసును విచారించిన హైకోర్టు.. విశాల్ రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలని, తన ఆస్తుల వివరాలను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు సూచించింది. అయితే విశాల్ ఈ ఆదేశాలను పాటించకపోవడంతో, లైకా ప్రొడక్షన్స్ కోర్టు ధిక్కరణ కేసును దాఖలు చేసింది. దీనిపై కోర్టు విశాల్‌ను మందలించి, తన ఆస్తుల వివరాలను దాఖలు చేయాలని ఆదేశించింది. దీంతో విశాల్ తన వద్ద ఉన్న 3 కార్లు, ఒక బైక్, రెండు బ్యాంకు ఖాతాలకు సంబంధించిన పత్రాలతో పాటు ఇంటి లోన్ డాక్యుమెంట్లు సమర్పించారు. అయితే రెండున్నరేళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం, మద్రాస్ హైకోర్టు లైకా ప్రొడక్షన్స్‌కు అనుకూలంగా తన తీర్పును వెల్లడించింది. దాదాపు రూ.21.29 కోట్ల అసలు మొత్తంతో పాటు 30 శాతం వడ్డీ, అలాగే న్యాయ పరమైన ఖర్చులను కలిపి మొత్తం లైకాకు చెల్లించాలని నటుడు విశాల్‌ను ఆదేశించింది.

## అన్ని ఆటలు ఆడేస్తాడు



రామ్‌చరణ్ 'పెద్ది' సినిమాను వచ్చే ఏడాది మార్చిలో విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించిన విషయం విదితమే. అయినా సరే.. సినిమా షూటింగ్‌ని మాత్రం యమ స్పీడ్‌గా కానిచ్చేస్తున్నారు చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సానా. బుధవారం నుంచి కొత్త షెడ్యూల్ మొదలైంది. ఇది పూర్తిగా నైట్ షెడ్యూల్ కావడం విశేషం. ఈ సినిమాలో నైట్ ఎఫెక్ట్ సీన్స్ చాలా ఉన్నాయట. ఈ సీన్స్ అన్నింటినీ ఈ షెడ్యూల్‌లోనే కంప్లీట్ చేస్తారని సమాచారం. రామ్‌చరణ్ ఇప్పటికే ఈ షెడ్యూల్‌లో ఎంటరయ్యారు.

త్వరలోనే జాన్వీ కపూర్ కూడా జాయిన్ అవుతారట. ఈ షెడ్యూల్‌లో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్ కూడా ఉంటుందని సమాచారం. ఇందులో రామ్‌చరణ్ ఆట కూలీగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఆ ఆటా ఈ ఆటా అని కాకుండా, అన్ని ఆటల్నీ ఇందులో రామ్‌చరణ్ ఆడేస్తారట. ఇది పీరియాడికల్ మూవీ కావడంతో అప్పటి వాతావరణం కళ్లకు కట్టేలా, ఉత్తరాంధ్ర సంస్కృతి ఉట్టిపడేలా భారీ ఖర్చుతో సెట్టింగులు నిర్మిస్తున్నారట. ఈ చిత్రాన్ని మైత్రీమూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ కలిసి నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

## హాలీవుడ్ పిలుస్తోందంటున్న దిశా పటానీ..




కల్కి సినిమాలో హీరో భైరవ. అతని లవ్ ఇంట్రస్ట్ రాక్సీ. ఈ రోల్ చేసింది దిశా పాట్నీ. కథ పరంగా పెద్దగా ఇంపార్టెన్స్ లేదు. కొన్ని సీన్లు, ఓ సాంగ్‌కి మాత్రమే పరిమితమయ్యారు దిశా. అయినా సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో దిశతో డార్లింగ్ ఆడిపాడిన సాంగ్‌కి మంచి క్రేజ్ వచ్చింది. నెక్స్ట్ పార్ట్ 2లో వీరిద్దరి స్క్రీన్ ప్రెజెన్స్ ఇంకొంచెం ఎక్కువే ఉండొచ్చనే మాటలూ వినిపిస్తున్నాయి. కల్కి తర్వాత కంగువ మీద కూడా బిగ్ హోప్స్ పెట్టుకున్నారు దిశ. కానీ సూర్యతో నటించిన కంగువ ఈ అమ్మణికి కలిసి రాలేదు. సినిమా ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. కంగువ అనుకున్నంత సక్సెస్ అయి ఉంటే తప్పకుండా సీక్వెల్ ఉండేది. సౌత్‌లో దిశకు మరో ప్రాజెక్ట్ ఉండేది. కల్కి సీక్వెల్ స్టార్ట్ అయ్యేవరకు బాలీవుడ్ ప్రాజెక్టులతో బిజీ కావాలన్నది దిశ ప్లాన్. ప్రస్తుతం బాలీవుడ్‌లో వెల్కమ్ టు ద జంగిల్ చేస్తున్నారు దిశ. ఈ సినిమా తర్వాత మాత్రం మరే ప్రాజెక్టులకూ సైన్ చేయలేదు. సమ్‌థింగ్ బిగ్ అంటూ ఊరించారు. ఆ బిగ్ న్యూస్ ఇప్పుడు రివీల్ అయింది. బాలీవుడ్ బ్యూటీ దిశా పాట్నీ హాలీవుడ్ ఎంట్రీకి రెడీ అవుతున్నారు. ది యూజువల్ సస్పెక్ట్, హౌస్ ఆఫ్ కార్డ్స్ లాంటి సినిమాలతో ప్రూవ్ చేసుకున్న ఆస్కార్ విన్నర్ కెవిన్ స్పేసీ నెక్స్ట్ మూవీ లో కీలక పాత్రలో నటించబోతున్నారు దిశా. హోలీ గార్డ్స్ పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం 20 ఏళ్ల తరువాత మెగా ఫోన్ పడుతున్నారు కెవిన్.

## అమ్మ నిజంగా దేవకన్యనే..



'జగదేకవీరుడు అతిలోక సుందరి' చిత్రం ఇటీవలే రీరిలీజ్ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తన తల్లి, దివంగత శ్రీదేవిని గుర్తుచేసుకుంటూ ఆమెకు నివాళిగా జాన్వీకపూర్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టింది. 'జగదేకవీరుడు అతిలోక సుందరి' పోస్టర్స్ ముద్రించిన డెనిమ్ జాకెట్‌ను ధరించి..ఆ ఫొటోలను ఇన్‌స్టాలో షేర్ చేసింది. 'కొద్దిరోజుల క్రితమే రీరిలీజ్ వెర్షన్‌ను చూశాను. అద్భుతంగా అనిపించింది. అమ్మను చూస్తుంటే నిజంగా దేవకన్యలా అనిపించింది. తన ముద్దుముద్దు మాటలు, చేష్టలు అబ్బురపరిచాయి. చిరంజీవిగారి కామెడీ హైలైట్. ఇంత గొప్ప చిత్రాన్ని అందించిన దర్శకులు రాఘవేంద్రరావుగారి విజన్‌కు హ్యాట్సాఫ్' అని రాసుకొచ్చింది. ఈ పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం జాన్వీకపూర్ తెలుగులో 'పెద్ది' చిత్రంలో నటిస్తున్నది.

## ప్రియుడితో కలిసి భర్త మర్డర్‌కు ప్లాన్..



ఓటీటీలో ఎప్పటికప్పుడు సరికొత్త జానర్ చిత్రాలు అందుబాటులోకి వస్తున్న సంగతి తెలిసిందే. సస్పెన్స్, మర్డర్ మిస్టరీ, క్రైమ్ థ్రిల్లర్ మూవీస్ చూసేందుకు జనాలు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఓటీటీలో ఓ క్రైమ్ థ్రిల్లర్ సస్పెన్స్ మూవీ తెగ ట్రెండ్ అవుతుంది. తన భర్తను చంపేందుకు ఓ ఇల్లాలు చేసే ప్లాన్.. తిరిగి ఆమె ఎలాంటి చిక్కుల్లో పడింది అనేది సినిమా. తన ప్రేమికుడితో కలిసి భర్తను హత్య చేసి వితంతువుగా మారే డ్రామాను క్రియేట్ చేస్తుంది.

ఈ ప్రమాదకరమైన సినిమా చూస్తూ మీరు ఆశ్చర్యపోతుంటారు. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్‌లో ఉన్న ఈ సస్పెన్స్, థ్రిల్లర్ క్రైమ్ సినిమా గురించి ఈరోజు తెలుసుకుందాం. ఓటీటీలో ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తున్న సినిమా "ఎ విడోస్ గేమ్". ఈ గేమ్‌లో మరణం, ఒక ప్రేమ వ్యవహారం, ఒక షాకింగ్ నిజం ఉంటాయి.

ఇక క్లైమాక్స్ మాత్రం అస్సలు ఊహించలేరు. ఇది స్పానిష్ సినిమా. ఎ విడోస్ గేమ్' పేరుతో ఎంత సింపుల్‌గా ఉందో కథ కూడా అంతే సాధారణంగా సాగుతుంది.

తన భర్తను హత్య చేసి వితంతువుగా మారిన మహిళ.. పోలీసుల నుంచి తన తన పొరుగువారి వరకు అందరినీ చిక్కుల్లో పడేసేలా తన భర్త మరణాన్ని ఉపయోగించుకుంటుంది. ఈ స్పానిష్ క్రైమ్ థ్రిల్లర్ 15.4 మిలియన్ల వ్యూస్ పొందింది. ప్రస్తుతం 24 దేశాల్లో ట్రెండింగ్ అవుతుంది. కార్లోస్ సెడెస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తుంది. ఆయన ఇప్పటికే ది అసుంటా కేస్ వంటి ఉత్కంఠభరితంగా సాగే చిత్రాలను రూపొందించారు.

ప్రేమ, మోసం, అబద్దాల సామ్రాజ్యాలు కలగలిసిన హత్య ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రస్తుతం ఈ మూవీ నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్‌లో ఉంది. కాబట్టి మీరు ఈ థ్రిల్లింగ్ , సస్పెన్స్ థ్రిల్లర్‌ని చూడకపోతే, OTTలో మిస్ అవ్వకండి.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com